
20-02-2025
గురువారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 156 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

## ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం



**జయభేరి, ఢిల్లీ :**
ఢిల్లీ ముఖ్యమంత్రిగా బీజేపీ మహిళను ఎంపిక చేసింది. యువ నేత రేఖ గుప్తా ఢిల్లీ సీఎంగా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.ఫిబ్రవరి 20న రామ్ లీలా మైదానంలో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని మోదీ, ఎన్డీయే పాలిత 19 రాష్ట్రాల సీఎంలు పాల్గొననున్నారు. ఢిల్లీ తదుపరి ముఖ్యమంత్రిగా యువ నేత రేఖ గుప్తాను బీజేపీ ఎంపిక చేసింది. దేశరాజధానిలో భారతీయ జనతా పార్టీ (BJP) అధికారంలోకి వచ్చిన వారం రోజుల తరువాత, ఢిల్లీ తదుపరి ముఖ్యమంత్రి పేరును ...మిగతాది 2 లో

## ఎటిఎం కార్డ్ సైజులో కొత్త రేషన్ కార్డు?

- పలు డిజైన్‌లను సిఎంకు చూపించిన అధికారులు
- ఈ కార్డుల కోసం షార్ట్ టెండర్లను పిలిచేందుకు ప్రభుత్వం సిద్ధం
- కార్డుల పంపిణీపై వేగం పెంచిన ప్రభుత్వం



2 లో

## సిలికాన్ సిటీలో దాహం కేకలు



**జయభేరి, బెంగళూరు, ఫిబ్రవరి 19:**
ఎండా కాలం రాక ముందే బెంగళూరు తీవ్రమైన తాగు నీటి సంక్షోభాన్ని ఎదుర్కుంటోంది. వాటర్ ట్యాంకర్ రేటు రూ. 750 నుంచి 1200కి పెంచింది కర్నాటక సర్కార్. ఇక ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ అయితే.. రూ. 6 వేలు వసూలు చేస్తున్నారు. దూరం పెరిగితే రేటు భారం మరింత పెరిగిపోతోంది. ఇక నగరంలో తాగునీటి వాడకంపై ఆంక్షలు విధించారు. వాటిని ఉల్లంఘిస్తే పెనాల్టీ వేస్తున్నారు. ఆ తప్పును రిపీట్ చేస్తే... డబుల్ పెనాల్టీలతో వాయిస్తున్నారు. చుక్క నీటిని కూడా ఒడిసి పట్టుకుని పొదుపుగా ...మిగతాది 2 లో



# పోరాటానికి సిద్ధమవ్వండి

- పోరాటానికి సిద్ధమవ్వండి
- రాష్ట్రంలో త్వరలో ఉపఎన్నికలు
- కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ పడిపోతోంది
- వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తాం కేసీఆర్
- వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల కోసం పార్టీ నేతలు పని చేయాలని సూచించారు. పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశానికి హాజరైన కేసీఆర్... ఏప్రిల్ 10 నుంచి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలుపెట్టాలని సూచించారు.
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆ పార్టీ రాష్ట్రస్థాయి విస్తృతస్థాయి సమావేశం జరిగింది. కీలక అంశాలపై చర్చించారు. పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు క్షేత్రస్థాయిలో బలోపేతం కావాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు.

పార్టీ స్థాపించి 24 ఏళ్లు పూర్తయి 25వ ఏట అడుగుపెడుతున్న నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నేతలకు కేసీఆర్ సూచనలు చేశారు. పార్టీ ఏర్పాటు, ఈ సందర్భంగా ఉద్యమ ప్రస్థానం, రాష్ట్ర ఏర్పాటుతో పాటు మరికొన్ని అంశాలను గుర్తు చేశారు. వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తామని వ్యాఖ్యానించారు. మళ్లీ తెలంగాణను నిలబెట్టుకునేందుకు పోరాడాలని నేతలకు సూచించారు. తెలంగాణ రాజకీయ అస్తిత్వ పార్టీగా, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తన చారిత్రక బాధ్యతను నిర్వహించిన తెలంగాణ ప్రజల పార్టీ బీఆర్ఎస్. తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాలను చైతన్య పరుస్తూ, తెలంగాణ అస్తిత్వ పటిష్టతకు కృషి చేసింది. గతం గాయాల నుండి కోలుకున్న తెలంగాణను తిరిగి అవే కష్టాల పాలు కాకుండా, గత దోపిడీ వలస వాదుల బారిన పడకుండా చూడాలి. తెలంగాణ ప్రజలకు శాశ్వత విజయం అందించే దిశగా సమస్త పార్టీ శ్రేణులు కృషి చేయాలి" అని కేసీఆర్ తెలిపారు. "ప్రజల కోసం పార్టీ నేతలు పని చేయాలి. ఏప్రిల్ 10 నుంచి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మొదలుపెట్టాలి. ప్రతి జిల్లా కేంద్రంలో సభ్యత్వ నమోదు జరగాలి. ఈ ఏడాది పొడవునా పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించాలి" అని కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు తీర్పు రాబోతుందని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఖచ్చితంగా ఎన్నికలు వస్తాయని... అందరూ సిద్ధంగా ఉండాలని సూచించినట్లు సమాచారం. ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ నిర్వహించాలని... పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా చేపట్టాలని కేసీఆర్ నిర్ణయించారు. పార్టీ కమిటీలు వేయాలని నేతలను ఆదేశించారు. కమిటీలకు ఇంఛార్జ్‌గా హరీశ్‌రావుకు బాధ్యతలు అప్పగించనున్నారు. "విద్యార్థి, మహిళా సహా పార్టీ అనుబంధ విభాగాలను మరింత పటిష్ట పరచాలి. అందుకోసం సీనియర్ పార్టీ నేతలతో కూడిన సబ్ కమిటీ లను ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రారంభించాలి" అని కేసీఆర్ సూచించారు.

## రైతు ద్రోహి జగన్

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఫైర్

**జయభేరి, అమరావతి:**
రైతు ద్రోహి జగన్ అని వైసీపీ పాలనలో ఏనాడు అన్నదాతలను పట్టించుకున్న పాపాన పోలేదని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత మండిపడ్డారు. మునిగిపోతున్న తన పార్టీని కాపాడు కోడానికి జగన్ వేస్తున్న పిల్లి మొగ్గలను ప్రజల గమనిస్తున్నారని, మరోసారి ఆయనను నమ్మే పరిస్థితే లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ 5 ఏళ్ల పాలనలో ఏనాడూ రైతులను పట్టించు కోలేదన్నారు. జగన్ అసమర్థ పాలన వల్ల గడిచిన 5 ఏళ్లలో ఎందరో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. రైతులకు ధాన్యం బకాయిలు చెల్లించకుండా ముఖం చాటేసిన ఘనుడన జగన్ అని మండి పడ్డారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులున్నా. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల ధాన్యం బకాయిలను సీఎం చంద్రబాబు చెల్లించారని మంత్రి తెలిపారు. వైసీపీ హయాంలోనే మిర్చి కనీస ధర 7 వేలుగా నిర్ణయించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ధర నిర్ణయంపై అప్పట్లోనే రైతులు



ఆందోళనకు దిగినా జగన్ పట్టించుకోలేదని, చివరకు మిర్చి ధరలు పడిపోయినా కొనుగోలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతు వ్యతిరేకిగా, ద్రోహిగా ముద్ర పడిన జగన్ ను ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసి తగిన గుణపాఠం చెప్పారన్నారు. జగన్ అసమర్థతను గ్రహించిన వైసీపీ నేతలు ఒక్కొక్కరిగా వైసీపీని వీడి పోతున్నారన్నారు. ...మిగతాది 2 లో



## ఎల్ఆర్ఎస్ పై తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్

- మార్చి 31 లోపు ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ

**జయభేరి, హైదరాబాద్ :**
లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 31 లోపు క్రమబద్ధీకరణ ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ ఇవ్వాలని మంత్రులు నిర్ణయించారు. 10 శాతం ప్లాట్లు రిజిస్టరైన లేఅవుట్లలో మిగిలిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్)పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ బాబు బుధవారం సమీక్ష నిర్వహించారు. అనధికార లేఔట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ఎల్ఆర్ఎస్ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎల్ఆర్ఎస్ పథకం అమలులో వేగం పెంచేందుకు 25 శాతం రాయితీ ఇవ్వాలని మంత్రులు నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన నాలుగు సంవత్సరాల నుంచి రిజిస్ట్రేషన్ కాని ప్లాట్ లు కొన్న ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్

పేదలకు మార్చి 31 వరకు వెసులుబాటు కల్పించారు. ఫీజులో రాయితీ. 10 శాతం ప్లాట్లు రిజిస్టరైన లేఅవుట్లలో మిగిలిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించనున్నారు. మార్చి 31 లోపు క్రమబద్ధీకరణ ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ ఇవ్వాలని మంత్రుల కమిటీ నిర్ణయించింది. నిషేధిత జాబితాలోని భూముల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్దే చెల్లింపులు చేసి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ప్రభుత్వానికి 25.67 లక్షల దరఖాస్తులు అందాయని మంత్రులు తెలిపారు. ఇందులో ప్లాట్లకు సంబంధించినవి 25.53 లక్షల దరఖాస్తులు కాగా, లేఅవుట్ల దరఖాస్తులు 0.13 లక్షలు ఉన్నాయని మంత్రులు తెలిపారు. అనధికార లేఔట్లలో ప్లాట్లను కొనుగోలు చేసిన వారు, వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు రూ.1000 ఛార్జీగా చెల్లించాలని 2020లో అప్పటి ప్రభుత్వం చెప్పడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారంతా దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇప్పటికీ వాటిని క్రమబద్ధీకరించలేదు. గతేడాది ఆగస్టు మొదటివారంలో అప్లికేషన్ల పరిశీలన ప్రారంభించినట్లు ప్రకటించారు. తాజాగా వీటిపై కీలక నిర్ణయం తీసుకున్నారు.

**పొలాలను వెంచర్లుగా మార్చి**

రాష్ట్రంలో కొత్త జిల్లాలు....జిల్లా కేంద్రాలు ఏర్పడడంతో... మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాల్లో వెంచర్లు వెలిశాయి. వ్యవసాయ భూములను కొన్న రియల్టర్లువాటిని వెంచర్లుగా మార్చి ప్లాట్లు చేసి అమ్మారు. చాలా మంది ఈ ప్లాట్లను కొనుగోలు చేశారు. అయితే వీటికి ఎల్ఆర్ఎస్‌తో లింక్ పెట్టడంతో వాటిని అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. ఎల్ఆర్ఎస్ కోసం గత ప్రభుత్వంలో 47,864 మంది రూ.వెయ్యి చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు.

వీటిపై ప్రభుత్వానికి రూ.4.78 కోట్ల ఆదాయం సమకూరింది. అనధికార వెంచర్లలో రెండో రిజిస్ట్రేషన్ కు అవకాశం ఇవ్వడంతో కొందరు అక్రమంగా క్రయవిక్రయాలు జరిపి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం ప్రభుత్వం దృష్టికి రావడంతో తాజాగా ఎల్ఆర్ఎస్ చేయాలని నిర్ణయం తీసుకుంది.

## రైతు ద్రోహి జగన్

దీంతో చేసేదేమీ లేక, పార్టీని కాపాడు కోడానికి రైతులపై మొసలి కన్నీరు కారుస్తూ మిర్చి రైతుల పరామర్శ పేరుతో కొత్త డ్రామా తెర తీశారన్నారు. జగన్ నమ్మే పరిస్థితిలో రైతులే కాదు వైసీపీ నేతలే లేరన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉందని ఎన్నికల అధికారులు హెచ్చరించినా, నియంతలా గుంటూరు మిర్చి యార్డుకెళ్లి నానా యాగీ చేశారన్నారు. జగన్ కు ప్రజా సామ్యం పైనా, చట్టాలపైనా గౌరవం లేదని మంత్రి సవిత ఆ ప్రకటనలో మండిపడ్డారు.

## సిలికాన్ సిటీలో దాహం కేకలు

వాడుకోవాలని ప్రజలకు సూచిస్తోంది కర్నాటక సర్కార్.వేసవి వచ్చేసరికి బెంగళూరులో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాగునీటిని పొదుపు చేసే చర్యల్లో భాగంగా బెంగళూరు జలమండలి సరికొత్త నిర్ణయం తీసుకుంది. తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగిస్తే రూ.5 వేలు జరిమానా వేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వాహనాలను శుభ్రం చేసేందుకు, గార్డెనింగ్ కోసం, రోడ్లుభవన నిర్మాణ పనులకు తాగునీటిని వినియోగించినా... సినిమా థియేటర్లు, మాల్స్‌లో ఇతర అవసరాలకు వాడినా జరిమానా తప్పదని ఉత్తర్వుల్లో హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి వాటర్ బోర్డ్ చట్టంలోని సెక్షన్ 109 ప్రకారం జరిమానా విధిస్తారు. పదేపదే అదే తప్పు చేస్తే మరో రూ.5 వేలు అదనంగా జరిమానా పడుతుంది అని సిటీ వాటర్ బోర్డు స్పష్టం చేసింది.ఫిబ్రవరిలోనే ఎండలు మండిపోతున్నాయి. ఇక మార్చి వస్తే...మూర్ఛ పోయే రేంజ్‌లో ఎండలు దంచి కొడతాయి. ఇక మే, జూన్ నెలల సంగతి చెప్పనే అక్కర్లేదు. ఇప్పటికే బెంగళూరులో తాగు నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. ఇక గత వేసవిలో బెంగళూరు మహానగరం తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొన్న విషయం తెలిసిందే. తాగేందుకు సరిపడా నీరు లేక సిలికాన్ సిటీ వాసులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత వేసవిని దృష్టిలో పెట్టుకొని కర్ణాటక సర్కార్ ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. తాగునీటిని వృథా చేస్తే భారీ జరిమానా విధించనున్నట్లు ప్రకటించింది.మంగళవారం నాడు బెంగళూరులో గరిష్ట ఉష్ణోగ్రత 31 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఈమధ్య కాలంలో వర్షపాతం లేకపోవడంతో భూగర్భ జలాలు ఎండిపోయినట్లు సిటీ వాటర్ బోర్డు తెలిపింది. రాబోయే రోజుల్లో తీవ్రమైన నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకే వాడుకోవాలని సూచించింది.గత వేసవిలో బెంగళూరు మహానగరం తీవ్రమైన తాగు నీటి సంక్షోభాన్ని ఎదుర్కొన్న సమయంలో...నగర ప్రజలు నిలువు దోపిడీకి గురయ్యారు. అప్పట్లో నగరం రోజుకు 300 నుంచి 500 మిలియన్ లీటర్ల మంచినీటి కొరతను ఎదుర్కొంది. ఇదే అదునుగా చూసుకుని ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల ఓనర్లు దోపిడీకి పాల్పడ్డారు. ట్యాంకు నీటికి రూ.వేలల్లో ఛార్జ్ చేశారు. ఇప్పుడు మళ్లీ ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. రాబోయే వేసవిలో తీవ్ర తాగు నీటి సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందేమో అని బెంగళూరు వాసులు, ఇప్పట్నించే బెంగ పెట్టుకుంటున్నారు.

## ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారం

పార్టీ ఖరారు చేసింది. బుధవారం సాయంత్రం బిజెపి శాసనసభ సమావేశంలో రేఖ గుప్తాను తదుపరి సీఎంగా నిర్ణయించారు. ఫిబ్రవరి 20న రామ్ లీలా మైదానంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఎన్డీయే పాలిత 19 రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమంలో కొత్త ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

**రేఖా గుప్తా ఎవరు?**

ఢిల్లీ బీజేపీలో రేఖా గుప్తా యువ నాయకురాలు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ఉన్నారు. విద్యార్థి దశలో బీజేపీ అనుబంధ విద్యార్థి విభాగం ఏబీవీపీలో క్రియాశీలకంగా ఉన్నారు. ఢిల్లీలో బీజేపీ మహిళా మోర్చా కు ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఇటీవలి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో శాలీమార్ బాగ్ స్థానం నుంచి 29 వేల పై చిలుకు మెజారిటీతో గెలుపొందారు.

**బీజేపీ ఘన విజయం**


మొత్తం 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 48 స్థానాలు గెలుచుకోగా, ఆమ్ ఆద్మీ పార్టీ (AAP) కేవలం 22 సీట్లకే పరిమితం అయింది. అయితే, బీజేపీ సీఎం అభ్యర్థి లేకుండానే ఎన్నికల్లో పోటీ చేసింది. ఫలితాలు వెలువడి 10 రోజులు గడుస్తున్నా సీఎం పీఠం ఎవరికి దక్కుతుందో ఇంకా ప్రకటించకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. చివరకు, యువ నాయకురాలు రేఖా గుప్తాను తదుపరి సీఎంగా బీజేపీ నిర్ణయించింది.

## ఎటిఎం కార్డ్ సైజులో కొత్త రేషన్ కార్డు?

;రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులపై వేగం పెంచింది. అందులో భాగంగా కొత్త రేషన్ కార్డులు ఎలా ఉండాలి, డిజైన్లు, రేషన్ కార్డులపై ఫ్యామిలీ ఫొటోలు ఉండాలా? వద్దా అనే వాటిపై సిఎం రేవంత్ రెడ్డితో అధికారులు చర్చిస్తున్నారు. ఒకవేళ కుటుంబసభ్యుల ఫొటోలు లేకపోయినా కుటుంబ సభ్యుల పేర్లు మొత్తం ఇందులో ఉంటాయని అధికారులు పేర్కొంటు న్నారు. కార్డు వెనుకవైపు అడ్రస్, రేషన్ షాపు నెంబర్, ఇతర వివరాలు కూడా ఉంటాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తమిళనాడు, కేరళ లాంటి తదితర రాష్ట్రాల్లో రేషన్ కార్డు తరహాలో ప్రభుత్వం ఇక్కడ రేషన్‌కార్డు తీసుకురాబోతున్నట్లుగా సమాచారం. ఈ నేపథ్యంలోనే పాత కార్డుల్లా కాకుండా స్మార్ట్ కార్డు రూపంలో ఏటిఎం కార్డు సైజులో అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టుగా తెలిసింది.ఈ మేరకు కార్డుల డిజైన్‌ను అధికారులు రెడీ చేస్తున్నారు. ఒకవైపు సిఎం ఫొటో, మరోవైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఫొటో, మధ్యలో ప్రభుత్వ లోగో ఉంటుందని అధికారిక వర్గాల సమాచారం. ఇప్పటికే పలు రేషన్ కార్డు డిజైన్లను అధికారులు సిఎంకు చూపించారు. అయితే, ముందుగా లక్ష కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వీటి కోసం షార్ట్ టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రజాపాలన, గ్రామసభలు, మీసేవ, కులగణనలో దరఖాస్తులు చేసుకున్న అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. ముందుగా కోడ్ లేని జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సిఎం ఆదేశించిన నేపథ్యంలోనే అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# నివేదికలే కానీ.. అమలు ఎక్కడ

**విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పరీక్షల కాలం వచ్చేసింది. ఒకవైపు పిల్లలకు పరీక్షల టెన్షన్ పెరుగుతుంటే, మరోవైపు వారి తల్లిదండ్రులలో మాత్రం టెన్షన్ రెండింతలవుతుంది. పిల్లల పరీక్షలతో పాటు, రాబోయే విద్యా సంవత్సరంలో ప్రత్యేకించి ప్రయివేట్ పాఠశాలల్లో చెల్లించాల్సిన ఫీజులపై ఆందోళనతో పేరెంట్స్ ఇప్పటి నుండే సతమతమవుతున్నారు. ఈ టెన్షన్లు ఏటా షరామామూలే అయినా ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం ముందడుగు వేస్తుండడంతో పేరెంట్స్ కొంత ఆశాదృక్పథంతో ఉన్నారు.**




ప్రయివేట్ పాఠశాలల్లో అడ్డూ అదుపు లేని ఫీజుల కట్టడి కోసం విద్యా కమిషన్ చేసిన సిఫార్సులను చట్టం రూపంలో తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తుందనే వార్తలు కాస్త ఊరట కలిగిస్తున్నాయి.విజ్ఞానం, విలువల కంటే మార్కులకే ప్రాధాన్యితిస్తున్న ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో ప్రయివేట్ స్కూళ్లకు ఆదరణ పెరి గింది. తమ కంటే తమ పిల్లల భవిష్యత్ మరింత మెరుగ్గా ఉండాలని కోరుకునే తల్లిదండ్రులు, వారికి తామిచ్చే ప్రధానమైన ఆస్తి మంచిగా చదివించడమే అనే భావనతో ఎంత ఖర్చుకైనా వెనుకాడడం లేదు. ఈ బలహీనతను ఆసరాగా చేసుకొ ని కొన్ని ప్రయివేట్ పాఠశాలలు ముక్కుపిండి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఘటనలు నిత్యం వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న సుమారు 11,500 ప్రయివేట్ స్కూళ్లల్లో ఫీజుల నియంత్రణ కోసం మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ 'తెలంగాణ ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ముసాయిదా బిల్లు2025' పేరిట జనవరి 24న పలు సిఫా ర్సులతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ బిల్లును చట్టం చేయాలని ప్ర భుత్వ వర్గాలు యోచిస్తున్నట్టు వార్తలు రావడం స్వాగతించాల్సిన పరిణామం.మౌలిక వసతులు లేమితో ఇరుకైన భ వనాల్లో, క్రీడా ప్రాంగణాలు లేకుండా తరగతి గదుల్లో పరిమితికి మించి విద్యార్థులతో బోధన సాగిస్తున్న ప్రయివేట్ పాఠశాలల్లో విద్యావ్యవస వ్యాపార వస్తువుగా మారిన నేపథ్యంలో ఈ కమిషన్ అనేక సూచనలు చేసింది. పే స్కూల్స్, టెక్నో స్కూల్స్, ఇంటర్నేషనల్, ఈటెక్నో, ఒలంపియాడ్ వంటి ఆకర్షణీయమైన పేర్లతో భారీగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలను కట్టడి చేయడానికి విద్యా కమిషన్ క్షేత్రస్థాయిలో పలు విద్యా సంస్థల యాజమాన్యాలతో, పేరెంట్స్ కమిటీలతో, విద్యావేత్తలతో, నిపుణులతో చర్చించడమే కాక, ఇతర రాష్ట్రాల్లోని విధి విధానాలను కూడా పరిశీలించి ప్రభుత్వానికి విలువైన సూచనలను అందించింది.

రాష్ట్రంలోని ప్ర యివేట్ విద్యాసంస్థలు వాటి స్థాయిని బట్టి ఏడాదికి రూ.10 వేల నుండి రూ.20 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నట్టు ఈ కమిటీ దృష్టికి వచ్చింది. గతంలో ఫీజుల ని యంత్రణ కోసం ప్రభుత్వం జీవో జారీ చేసి నా న్యాయపరమైన సమస్యలతో ప్రక్రియ ఆగిపోవడంతో ప్రయివేట్ పాఠశాలల ఆగడాలకు అంతే లేకుండా పోయిందని, గతం లో తిరుపతిరావు కమిటీ సిఫార్సులను ప్ర యివేట్ పాఠశాలలు తుంగలో తొక్కుతున్నా పర్యవేక్షణ కరువైందని, విద్యా కమిటీని బంధనలను విద్యా సంస్థలు అటకెక్కించినా అడిగే నాథుడే లేరని గుర్తించిన కమి షన్ ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేసింది.తెలంగాణలో ప్రయివేట్ పాఠశాలలు అధికంగా వసూలు చేస్తున్న ఫీజుల ని యంత్రణకు ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ఒక రెగ్యులేటరీ కమిషన్, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక రెగ్యులేటరీ కమిషన్లు ఏర్పాటు చేసి వాటికి చట్టబద్ధత కల్పించాలనే ప్రధానమై న సిఫార్సు చేసింది. రాష్ట్ర స్థాయి కమిషన్ చైర్మన్‌గా సుప్రీం కోర్టు/ హై కోర్టు రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని నియమించాలని చెప్పింది. పాఠశాల యాజమా న్యాల ప్రతినిధులను, రిటైర్డ్ ప్రొఫెసర్లను, విద్యావేత్తలను, విద్యా శాఖలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉన్నతాధికారిని, ఒక చార్టెర్డ్ అకౌంటెంట్‌ను సభ్యులుగా నియమించా లి. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల్లోని పాఠ శాలల ఫీజులను స్టేట్ ఫీజు రెగ్యులేటరీ కమిషన్, మిగత జిల్లాల్లో ఫీజుల ఖరారు కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో డీఎఫ్ఆర్‌సీ ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించాలని కమిషన్ చెప్పింది.ప్రయివేట్ పాఠశాలలను 5 కేటగిరీలు గా విభజించి, వాటికి వేర్వేరు ఫీజులు ఖరారు చేయాలని కమిషన్ సూచించింది. ఆయా పాఠశాలలకు ఉన్న స్థలం, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, డైనింగ్ హాళ్లు, క్రీడా స్థలం, ఇతర సౌకర్యాల ఆధారంగా కేటగిరీలు, ఫీజులు నిర్ధారించాలని కమిషన్ పేర్కొంది. ఖరారు చేసిన ఫీజుల వివ రాలను పాఠశాల వెబ్‌సైట్లలో పెట్టి అంతే తీసుకోవాలి. మేనేజ్‌మెంట్లు అడ్మిషన్ ఫీజులు వసూలు చేయకుండా, ట్యూషన్ ఫీజును మాత్రమే తీసుకోవాలని కీలకమై న సిఫార్సు చేసింది.

ఎప్పటికప్పుడు ఫీజులకు సంబంధించిన ఆడిట్ నివేదికలను కూడా బహిర్గతం చేయాలని కమిషన్ కీలక సూచన చేసింది.నిర్దేశించిన ఫీజు కంటే అధికంగా వసూ లు చేసే విద్యా సంస్థలపై వెంటనే విచారణ జరిపి మొదటిసారి రూ.లక్ష జరిమానా వి ధించాలి. రెండోసారి ఆ సంస్థ నుండి అదే తప్పిదం పునరావృతమైతే రూ.2 లక్షలు, మూడోసారి రూ.5 లక్షల జరిమానా వే యాలి. అయినా మార్పు రాకపోతే ఆ పా ఠశాల అనుమతులను రద్దు చేయాలనే క ఠినమైన సిఫార్సులను కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. పాఠశాలలో ఉండే గ్రంథాలయం, ల్యాబ్స్, కంప్యూటర్ ల్యాబ్ సౌ కర్యాలతో పాటు టీచర్ల విద్యార్హతలు, పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల సంఖ్య, పాఠశాల నిర్వహణకు అయ్యే ఖర్చుల ఆధారంగా ఫీజులు ఉండాలని కమిషన్ స్పష్టం చేసింది. అధికంగా ఫీజులు వసూలు చేసే అంశమే కాకుండా విద్యా ప్రమాణాలను పరిరక్షించడం, ఉపాధ్యాయుల సామర్థ్యం పెంపు, పాఠశాలలపై పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టడం, విద్యా హక్కు చట్టం అమలు వంటి అధికారాలను కూడా కమిటీలకు ఇవ్వాలని కమిషన్ సూచించింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు రాష్ట్రా ల్లో ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రయివేట్ పాఠశాలలపై సరైన నిఘా లేకపోవడంతో ఫీజులపై కట్టడి లేకుండా పోయింది.


ఉదాహరణకు దేశంలోని ఒక ప్ర ముఖ విద్యా సంస్థ ఉత్తరాది రాష్ట్రాల్లో వ సూలు చేసే ఫీజుల కంటే, హైదరాబాద్‌లోని తమ ఫ్రాంచైజీలలో అధిక ఫీజులు వసూలు చేస్తోంది. పిల్లల అడ్మిషన్ల కోసం ప్రయివేట్ స్కూళ్లకు వెళ్తే తల్లిదండ్రులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ ఇబ్బందులు పె ట్టే పద్ధతికి స్వస్తి పలకాలి. ఇప్పటికే అధిక ఫీజుల ని యంత్రణతో పాటు విద్యాసంస్థ ల్లో సంస్కరణల కోసం మధ్యప్రదేశ్, గుజ రాత్ ప్రభుత్వాలు చేసిన చట్టాలు సత్ఫలితాలిస్తుండడంతో వాటిని కూడా పరిగణ లోకి తీసుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి, సంస్కరణల కోసం 2024 జులైలో మం త్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీ తక్క ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి పలు చర్యలు చేపట్టింది. అందరికీ అందుబాటులో ఉండాల్సిన విద్య కార్పొరేటర్ల చేతిలో ఒక వ్యాపార వ స్తువుగా మారిపోవడం దురదృష్టకరం. ప్ర స్తుత పరిస్థితుల్లో చదువును కొనలేక, చదువుకోలేక ఇబ్బందులు పడుతున్న పేద, మ ధ్య తరగతి వర్గాలకు ఉపశమనం కలిగించేలా ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం రాష్ట్రంలో ప్రత్యేక చట్టం చేయా ల్సిన ఆవశ్యకత ఉంది. విద్యా కమిషన్ నివేదికపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించి రా బోయే విద్యా సంవత్సరం ఆరంభం నాటి కే ఒక చట్టాన్ని తయారుచేస్తే ప్రయివేట్ పాఠశాలల దాష్టీకాల నుండి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విముక్తులవుతారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దనే విద్యా శాఖ కూడా ఉండడంతో ప్రయివేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల కట్టడికి, విద్యా వ్యవస్థలో సంస్కరణలకు ఆయన ప్రత్యేక చొర వ తీసుకొని చట్టం రూపొందించి వీలైనంత త్వరగా అమలు చేస్తారని ఆశతో ఎదురు చూస్తున్నా..

> **తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి, సంస్కరణల కోసం 2024 జులైలో మం త్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీ తక్క ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి పలు చర్యలు చేపట్టింది. అందరికీ అందుబాటులో ఉండాల్సిన విద్య కార్పొరేటర్ల చేతిలో ఒక వ్యాపార వ స్తువుగా మారిపోవడం దురదృష్టకరం.**

# గిట్టుబాటు ధర లేదు భద్రత లేదు

✍ **జయభేరి, గుంటూరు, ఫిబ్రవరి 19:**

గుంటూరు మిర్చియార్డులో రైతులతో మాట్లాడారు మాజీ సీఎం జగన్. వారి సమస్యలు తెలుసుకున్న తర్వాత మీడియాతో మాట్లాడారాయన. ఈ సందర్భంగా కీలక విషయాలు బయటపెట్టారు. తాను గుంటూరుకు వస్తున్నాని తెలిసి కనీసం పోలీసు భద్రత కూడా ఇవ్వలేదన్నారు. రేపటి రోజు తాము అధికారంలోకి వచ్చాక ఇలాగే జరుగుతుందని, పోలీసు భద్రత ఇవ్వకపోతే ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలన్నారు.మీ ప్రభుత్వం కంటిన్యూగా ఉండదని, ప్రస్తుతం మీరు చేస్తుంది కరెక్టో కాదో మీరే ఆలోచించుకోవాలన్నారు మాజీ సీఎం. విచిత్రం ఏంటంటే.. గుంటూరుకు వెళ్తున్నట్లు ఆ జిల్లా అధికారులకు వైసీపీ నాయకత్వం ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అలాగే ఈసీకి కూడా సమాచారం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో మాజీ సీఎంగా జగన్‌కు ఉండాల్సిన భద్రతను పోలీసులు కల్పించినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.సీఎం స్థాయిలో భద్రత కావాలంటే ఎలాగని అంటున్నారు అధికారులు. అయినా మాజీ సీఎం ఎక్కడకు వెళ్తున్నారో సమాచారం ఇవ్వకుంటే భద్రత ఎలా ఇస్తామని అంటున్నారు. ఈ క్రమంలో రైతుల సమస్యల గురించి మాట్లాడారు జగన్. ఏపీలో ఏ ఒక్క రైతూ సంతోషంగా లేరన్నారు. ఈ పరిస్థితికి కూటమి ప్రభుత్వమే కారణమన్నారు. గుంటూరు మిర్చి రైతులకు ఆయన సంఘీభావం తెలిపారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు చాలా కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



### అప్పుడు లేని కోడ్ ఇప్పుడెలా వచ్చింది?

**ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి మిర్చి యార్డు రైతుల కష్టాలు తెలుసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో రైతులకు అండగా వైసీపీ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. మరోవైపు ఆ పార్టీ నేత అంబటి రాంబాబు రియాక్టు అయ్యారు. వల్లభనేని వంశీని పరామర్శించేందుకు జైలుకి వెళ్లినప్పుడు లేని కోడ్ ఉల్లంఘన, ఇప్పుడెలా వచ్చిందన్నారు. రైతులను బాధను తెలుసుకునేందుకు వస్తే కోడ్ గుర్తుకు వచ్చిందా అంటూ ప్రశ్నలు రైజ్ చేశారు. ఇదంతా మంత్రి లోకేష్ ఆడిస్తున్న డ్రామా వర్ణించారాయన. జగన్ పర్యటనను డ్రోన్ తో చిత్రీకరించారు పోలీసులు. ఈ లెక్కన రేపో మాపో ఆయనకు ఈసీ నోటీసులు ఇవ్వడం ఖాయమని అంటున్నారు.**

రైతులు బతికే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఇక వైసీపీ పాలన గురించి చెప్పుకునే ప్రయత్నం చేశారు మాజీ సీఎం. కూటమి ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో రైతులు నష్టపోకుండా గిట్టుబాటు ధర కల్పించామన్నారు. పెట్టుబడి సాయం చేసి రైతులకు అండగా నిలిచామని వివరించారు.వైసీపీ హయాంలో రైతే రాజని, కూటమి ప్రభుత్వం వారిని దగా చేసిందన్నారు. పెట్టుబడి సాయం సాయం ఇవ్వలేదని, రైతులకు సున్నా వడ్డీ రాని పరిస్థితి నెలకొందన్నారు. మిర్చి రైతుల అవస్థలను చంద్రబాబు సర్కార్ ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఆర్బీకే వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఈ ఏడాది దిగుబడి బాగా తగ్గిందన్నారు. రైతులను దళారీలకు అమ్మేసే పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో ఉందన్నారు.



## రాత్రికి రాత్రే సీఈసీ ఎంపిక చేయడం సరికాదంటున్న రాహుల్

✍ **జయభేరి, న్యూఢిల్లీ:**

భారత ప్రధాన ఎన్నికల కమిషన్‌గా జ్ఞానేశ్ కుమార్ ఎంపికైన కొద్ది గంటలకే ఎంపిక కమిటీలో సభ్యుడైన విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. సీఈసీ ఎంపికపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణ జరుగుతుండగానే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా అర్ధరాత్రి వేళ నిర్ణయం తీసుకోవడం అగౌరవ ప్రదమైన చర్య అవుతుందన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాహుల్ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. సీఈసీ ఎంపిక కమిటీ సమావేశంలో మోదీ, అమిత్‌షాకు అభ్యంతరాల నివేదకను అందజేశాను. కార్యనిర్వాహక వర్గం జోక్యం లేని స్వతంత్ర ఎలక్షన్ కమిషన్‌లో ఎన్నికల సంఘం కమిషనర్, ప్రధాన ఎన్నికల కమిషన్‌ను ఎంపిక చేసే ప్రక్రియ కీలకం. ఎంపిక కమిటీ నుంచి సీజేఐను తొలగించడం ద్వారా మోదీ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించింది. ఇది ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై లక్షలాది మంది ఓటర్ల ఆందోళనకు కారణమవుతోంది అని రాహుల్ అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, జాతి నిర్మాతల సిద్ధాంతాలకు కట్టుబడటం, ప్రభుత్వాన్ని జవాబు దారీని చేయాల్సిన బాధ్యత ఒక ప్రతిపక్ష నేతగా తనకు ఉందని రాహుల్ చెప్పారు. కమిటీ కూర్పు, ప్రక్రియను సుప్రీంకోర్టులో సవాలు చేస్తూ వేసిన పిటిషన్‌పై మరో 48 గంటల్లోనే విచారణ జరగాల్సి ఉండగా రాత్రికి రాత్రి ప్రధాని హోం మంత్రి నిర్ణయం తీసుకోవడం సరికాదని అన్నారు.

# మత సామరస్యాన్ని పెంపొందించిన బహుజన చక్రవర్తి ఛత్రపతి శివాజీ

- ఛత్రపతి స్ఫూర్తితో అంతరాలు లేని సమాజంకై కృషి చేయాలి
- ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి

**జయభేరి, మేడ్చల్ :**





మత సామరస్యాన్ని నెలకొల్పిన చత్రపతి శివాజీ మహారాజ్ ని స్మరించుకొని ఆయన ఆశయాలు, లక్ష్యాల కోసమే పోరాడుదామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ పిలుపునిచ్చారు. ఛత్రపతి శివాజీ 395వ జయంతిని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ లు సంయుక్తంగా మాట్లాడుతూ.. మహారాష్ట్రలో 16వ శతాబ్దంలో ఉన్న వైదిక, బ్రాహ్మణీయ ఆధిపత్య కులాలు మాత్రమే రాజ్యాన్ని పరిపాలించాలి, శూద్రులు రాజ్యానికి పరిపాలించడానికి వీలు లేదు అనే సంస్కృతిని ధిక్కరిస్తూ పిష్వాలా వ్యతిరేకంగా మహారాష్ట్రలో మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన శూద్ర కులాల, కార్మిక వర్గం ప్రజల ప్రతినిధి చత్రపతి శివాజీ అని వారు అన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించక ముందు సిద్ధించిన తర్వాత కొంతమంది బ్రాహ్మణీయ భావజాలం కలిగిన రాజకీయ నాయకులు, పార్టీలు శివాజీని హిందూ ధర్మాన్ని, మతాన్ని ముస్లిం రాజుల నుంచి కాపాడిన వ్యక్తిగా ముస్లిం వ్యతిరేకిగా చరిత్రను వక్రీకరించారని ఆయన తెలిపారు. చత్రపతి సైన్యంలో అన్ని మతాలకు అన్ని కులాలకు సమానమైన ప్రాధాన్యం ఇచ్చేవారని దానిని అందరూ గుర్తించాలని అన్నారు. అదేవిధంగా శివాజీ తన రాజ్యంలో రైతుల సంక్షేమం కోసం కార్మికుల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు, సంక్షేమ విధానాలను తీసుకువచ్చి దున్నేవాడిదే భూమి అని భూమిని పంచిన చరిత్ర ఆయనకు ఉందని తెలిపారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత శివాజీని కొన్ని రాజకీయ పార్టీలు ప్రధానంగా బిజెపి ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ మత సంస్థలు ప్రజల ఓట్లు కొల్లగొట్టడానికి తప్పుడు సూత్రీకరణలు చేస్తున్నారని దానిని ప్రజలు గమనించాలన్నారు. జ్యోతిరావు పూలే,డాక్టర్ అంబేద్కర్, గోవింద్ పన్సారే లాంటి మహనీయులు శివాజీ వాస్తవ చరిత్రను తీసుకువచ్చే ప్రయత్నం చేశారని చత్రపతి శివాజీ లక్ష్యాలు, శూద్ర కులాలకు రాజ్యాధికారం, రైతుల, కార్మికుల సంక్షేమం కోసమే ప్రజలు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నేత సతీష్ కుమార్,ఏఐవైఎఫ్ జిల్లా నేతలు గిరి బాబు,సాయి, రాజు, విజయ్, అక్షయ్, సుదర్శన్,సీపీఐ ఉప్పల్ మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే బండారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

**జయభేరి, కాప్రా :**

చీర్యాలలోని బండారి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోదరుడు బండారి వెంకటరెడ్డి సతీమణి బండారి పద్మ దశదిన కర్మకు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, సుధీర్ రెడ్డి, Dr సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి. మాజీ కార్పొరేషన్ చైర్మెన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, రావుల శ్రీధర్ రెడ్డి, నందికంటి శ్రీధర్, మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఈనాడు ఎడిటర్ DN ప్రసాద్, కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



## మంత్రి శ్రీధర్ బాబును కలిసిన మాజీ మేయర్



**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ గారు బుధవారం నాడు జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోడుప్పల్ కార్పొరేషన్ లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు ఇతర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్ళినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీ అన్నపూర్ణ దేవి సహిత విశ్వనాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం లో పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కేశవ నగర్ కాలనీలో శ్రీ అన్నపూర్ణ దేవి సహిత విశ్వనాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో కాలనీ కమిటి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులు గా తెలంగాణ రాష్ట్ర మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


**జయభేరి, మేడిపల్లి**

## గర్ల్స్ ఎడ్యుకేషన్ హబ్ సందర్శించిన కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు



**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 19 :**

యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మాజీ ఎం ఎల్ ఏ, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాళ్లు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎడ్యుకేషన్ హబ్ పేరుతో వేల కోట్ల రూపాయలను కజేసిందిన్నారు. హబ్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు కనీసం మెయింటెనెన్స్ కూడా లేదని అన్నారు. ఆడిటోరియంలో చెత్తాచెదలు నిండిపోయి దాన్ని పట్టించుకున్న పరిస్థితి లేదని అన్నారు. బయట నుంచి వ్యక్తులు వచ్చి క్యాంపు కోసం అన్నిరకాలుగా ఉపయోగించుకుంటున్నారు. కనీసం ఇక్కడ వాచ్మెన్ కూడా లేకపోవడం దురదృష్టకరమని అన్నారు దీనికి కారణం ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వమేనని నర్సారెడ్డి గారు అన్నారు. ఎమ్మెల్సీ ఎలక్షన్ల తర్వాత హబ్ సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాచారం శేఖర్, నరేష్, ప్రవీణ్, స్వామి, పాల్గొన్నారు.



## జువ్వమాంబ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలము కన్నూరు పంచాయతీ మడక పాలెం గ్రామంలో జువ్వమాంబ అమ్మవారి ఆలయం నందు మూడవ వార్షికోత్సవ వేడుకలు గొప్పగా జరుపుటకు కమిటీ వారు నిర్ణయం తీసుకున్నారు. ఉదయం ఆరు గంటల నుండి అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని అదేవిధంగా మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని కమిటీ వారు తెలియజేసారు.భక్తులు అందరూ అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించిఅమ్మవారి యొక్క కృపా కటాక్షములు పొందాలని కమిటీ వారు తెలిపారు.

## గురుకుల ఎగ్జామ్స్ రాసే విద్యార్థులకు ప్యాడ్స్ పెన్నులు పెన్సిల్లు బహుమతి

- బిఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు పొట్ట మధు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ సంజయ్ కాలనీ లో మునగాల కొండలరావు యు పి ఎస్ స్కూల్ లో గురుకుల ఎగ్జామ్ రాసే విద్యార్థులకు దేవరకొండ బి ఆర్ ఎస్ పట్టణ యూత్ అధ్యక్షులు పొట్ట మధు ప్యాడ్ పెన్సిల్ లు పెన్నులు రబ్బరులు బహుమతిగా ఇవ్వడం జరిగింది. పొట్ట మధు మాట్లాడుతూ విద్యార్థులు ఎగ్జామ్స్ మంచిగా రాసి విద్యార్థులు మంచి భవిష్యత్తులో రాణించాలని ఉద్దేశంతో విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే ప్యాడ్లు మిగతా వి ఇచ్చినానని తెలియజేసినారు. స్కూలు ఆవరణలో విద్యార్థులచే మొక్కలు నాటినారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ ఎం ఝాన్సీ రాణి ఉపాధ్యాయులు బిఆర్ ఎస్ పట్టణ అధ్యక్షులు పొట్ట మధు, గుండు నరేష్, నాగిళ్ల సంతోష్, అంకురి సంతోష్, పొట్ట బిక్షపతి, జిల్లా వెంకటేష్, శ్రవణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# కేజీ టూ పిజీ కళాశాల ఏర్పాటు చేయాలనీ కోరుతూ వినతి పత్రం

**జయభేరి, ఘట్కేసర్ :**



తెలంగాణ రాష్ట్ర IT శాఖ మంత్రి దుదిల్లా శ్రీధర్ బాబుని ఆయన నివాసంలో కలిసి ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని గురుకుల కళాశాల మైదానం 26 ఎకరాల భూమికి రక్షణ కల్పిస్తూ కేజీ టూ పిజీ కళాశాల ఏర్పాటు చేయాలనీ కోరుతూ వినతి పత్రం అందజేసిన మాజీ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్.
ఈ సందర్భంగా మాజీ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఘట్కేసర్ మునిసిపాలిటీ పరిధిలో గల గురుకుల్ కాలేజీ సంబంధిత 26ఎకరాల భూమిలో KG to PG కళాశాల కావాలని గతంలో కొందరు నాయకుల అండదండలతో 15 సంవత్సరల క్రితం రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకొని అక్కడ దాదాపు 2 ఎకరాల భూమిని కబ్జా చేశారాని కావున గురుకుల్ కళాశాల భూమికి రక్షణ కల్పించాలని కోరడంతో వేంటనే స్పందించి సంబంధిత కలెక్టర్ కి అతి త్వరగా గురుకుల్ కళాశాల భూమి సంరక్షణకి చర్యలు తీసుకుంటామని తెలుపుతూ.. కలెక్టర్ తో కలిసి సమస్య మళ్ళీ ఒకసారి వివరించమని తెలుపుతూ.. కేజీ టూ పిజీ కళాశాల త్వరగా ఏర్పాటు చేసేందుకు ఇట్టి విషయం ముఖ్య మంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా అని హామీ ఇచ్చారని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపోలా మల్లేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవ్ రెడ్డి, నాయకులు కడుపోలా రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రాంకీ ఫౌండేషన్ జర్నలిస్టు స్పోర్ట్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఆహ్వానపు క్రికెట్ పోటీలు

- పోటీలో పాల్గొనే జట్ల డ్రా లో పాల్గొన్న రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్

**జయభేరి, పరవాడ :**




పరవాడ జర్నలిస్టు స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాంకీ ఫౌండేషన్ సహకారంతో గురు, శుక్రవారాల్లో ఉమ్మడి విశాఖ జిల్లాల జర్నలిస్టులకు ఆహ్వానపు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్ తెలిపారు. ప్రతి సంవత్సరం విశాఖ ఫార్మసిటీ క్రీడ మైదానంలో జర్నలిస్టులకు క్రికెట్ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈనెల 20, 21 తేదీల్లో జర్నలిస్టులకు ఆహ్వానపు క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా బుధవారం క్రికెట్ పోటీల్లో పాల్గొనే జట్లకు రాంకీ ఫౌండేషన్ కార్యాలయంలో డ్రా తీయడం జరిగిందని తెలిపారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన మొత్తం ఏడు జట్లు ఈ క్రికెట్ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. పోటీల్లో విజయం సాధించే జట్లకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులకు అన్ని మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. నిత్యం పని ఒత్తుల్లతో సతమతమయ్యే జర్నలిస్టులకు ఈ క్రికెట్ పోటీలు మంచి ఉత్సాహాన్ని ఇస్తాయని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రికెట్ పోటీలను విశాఖ ఫార్మసిటీ ఎండీ పి. పి. లాల్ కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పరవాడ జర్నలిస్ట్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సిహెచ్ లోకేష్, ఎండి రాజు, జట్టు కెప్టెన్ శ్రీను, వైస్ కెప్టెన్ సునీల్, సభ్యులు శివాజీ, ఈశ్వరరావు, రాధా కృష్ణ,చందు, ప్రేమ్, నందవరపు రాము, పవన్, రామ్ కి ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండండి

- వైద్య సేవలు సకాలంలో అందజేయాలి జిల్లా వైద్య టాస్క్ ఫోర్స్ బృందం

**జయభేరి, పరవాడ:**



కన్నూరు విలేజ్ హెల్త్ క్లినిక్ ని జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం సందర్శించి ఆరోగ్య కార్యక్రమాలు ఎలా అమలు చేస్తున్నది పరిశీలించడం జరిగినది. గర్భిణీ స్త్రీలను గుర్తించి సకాలంలో వారికి వైద్య సేవలు అందించే విధంగా చూడాలి. ఆసుపత్రిలోనే సురక్షిత కాన్పులు జరిగే విధంగా ఎ.ఎన్.ఎమ్, ఆశ కార్యకర్తలు ప్రణాళిక తయారు చేయాలి. జన్మించిన ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలి. ఆసుపత్రిలో సురక్షితమైన కాన్పులు జరిగే విధంగా చూడాలి. మాతృ శిశు మరణాలు జరగకుండా సకాలంలో వైద్య సేవలు అందజేయాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి యాప్ లో అప్లోడ్ చేసి సీజనల్ వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని టాస్క్ ఫోర్స్ బృందం ఆరోగ్య సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగినది. అనంతరము ఆన్ లైన్ లో ఆరోగ్య సేవలు అమలవుతున్న తీరును పరీలించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిపిఓ జగదీష్, స్టాటికల్ ఆఫీసర్ రామ మచంద్రావు, కోఆర్డినేటర్ జనార్ధన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎమ్.ఎస్. ఎస్.సాయిరాం, పి. హెచ్. ఎన్. జానకి రామన్ యు.డి.సి.ఆనంద్ కుమార్ ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించినారు

జయభేరి, దేవరకొండ :

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని అంజయ్య కాలనీలో శ్రీశ్రీశ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలవేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దేవరకొండ బిజెపి మున్సిపల్ అధ్యక్షులు వస్కుల సుధాకర్ మాట్లాడుతూ హైందవ జాతి రక్షణకై కత్తి పట్టిన శంకరుడు పరాయిపాలకులకు యమకింకరుడు దేశ రక్షణే ధ్యేయంగా ధర్మ రక్షణే ధ్యానంగా హిందుత్వమే ప్రాణంగా స్వాభిమానమే ఆయుధంగా జాతి పౌరుషాన్ని చాటిన శత్రు భయంకరుడు హిందూ హృదయ సామ్రాట్ శ్రీశ్రీశ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఉప్పల వెంకటేష్, గుండాల అంజయ్య, జల్దా భాస్కర్, చండీశ్వర్, రెడ్డి శంకర్, అర్థం రమేష్, చిలక రాజు బిక్కు, పున్న వెంకటేష్, పగ్గిల్ల రామ్, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సింగం సత్తయ్య



జయభేరి, మార్కుక్, ఫిబ్రవరి 19 :

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం కాశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ బిజెపి నాయకుడు సింగం సత్తయ్య బీజేపీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నియామకమయ్యారు, బుధవారం సింగం సత్తయ్య మాట్లాడుతూ నా మీద నమ్మకంతో బిజెపి పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా అవకాశం కల్పించిన బీజీపీ నాయకులకు, ఎంపీ రఘునందన్ రావు ఎంపీ ఈటెల రాజేందర్ కు, బీజేపీ శ్రేణులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు,బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ విజయం సాధించడానికి కార్యకర్తలు కృషి చేయాలని, మోడీ సారథ్యంలో భారతదేశం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి జయ కేతనం ఎగుర వేస్తుందని అన్నారు.

## కాంగ్రెస్ నాయకులకు గజమాలతో సత్కారం



జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 19 :

సిద్ధిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో తూంకుంట నర్సారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలంమధు పాల్గొన్నారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలంమధు ముదిరాజ్ ను మరియు డీసీసీ అధ్యక్షులు నర్సారెడ్డి ని గజమాల తో ములుగు మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జోగిని రవి ముదిరాజ్ మరియు ఎన్ఎమ్ఆర్ గజ్వేల్ యువసేన నాయకుడు కాశబోయిన శేఖర్ ముదిరాజ్ ,వంటిమామిడి డాకూరి అర్జున్ సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోవు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ కేతనం ఎగురవేస్తామని వారు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకు వెళ్లే విధంగా కృషి చేస్తామని చెప్పారు. ప్రతిపక్షాలు ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యువతరం యూత్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు




జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 19 :

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ పల్లెపహాడ్ గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు యువతరం యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యువతరం యూత్ అధ్యక్షుడు మాట్లాడుతూ అఖండ భారత సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మొగల్ సామ్రాజ్యాన్ని వెన్నువిరిచిన మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ అని అన్నారు. మాతృభూమి పై ఉన్న మక్కువ, హిందూ సామ్రాజ్యాన్ని నిర్మించిన భరతమాత వీరపుత్రుడు, ఛత్రపతి శివాజీ మహారాజ్. భారత జాతి వీరత్వానికి ప్రతీక భారత జాతి సగర్వంగా చెప్పుకునే ధీరుడు. యువతరానికి పౌరుషాగ్నిని రగిలించే దిక్సూచి. ధైర్యానికి, దేశభక్తికి, దైవభక్తికి, ధీరత్వానికి మారుపేరు హిందు ధర్మాన్ని కాపాడిన దురంధరుడు, శత్రువులకు సింహస్వప్నం అయిన శివాజీ మహారాజ్ నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో యువతరం యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తర తెలంగాణకు కేంద్రంలో నిర్లక్ష్యం

- విద్యాసంస్థలను.. గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్ లకు తరలిస్తున్న ప్రధాని మోడీ
- ఏడాదిలోనే.. 55 వేల ఉద్యోగాలిచ్చిన ఘనత కాంగ్రెస్ సర్కార్
- గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో.. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి బాటలు
- రాష్ట్రంలో.. బిజెపి, బిఆర్ఎస్ పార్టీల చీకటి ఒప్పందం బహిర్గతం
- గ్రాడ్యుయేట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ ఎన్నికల ఇన్చార్జి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 19 :

ఎన్నికల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన రెండు కోట్ల ఉద్యోగాల కల్పన హామీగానే నిలిచిపోగా, ఉత్తర తెలంగాణను కేంద్రంలోని బిజెపి సర్కార్ నిర్లక్ష్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వ రంగ, విద్యా రంగ సంస్థలను గుజరాత్, ఉత్తరప్రదేశ్ లకు తరలిస్తుందని గ్రాడ్యుయేట్ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, సమన్వయకర్త గుత్తా అమిత్ రెడ్డి, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్ విమర్శించారు. బుధవారం గజ్వేల్ నియోజకవర్గ స్థాయి సన్నాహక, ఆత్మీయ సమావేశం డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని స్పష్టం చేశారు. ఉమ్మడి అదిలాబాద్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించి సమస్యల పరిష్కారానికి బాటలు వేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున నిరుద్యోగులు, యువత, ఉద్యోగ ఉపాధ్యాయులు ఎర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం సులువుగా జరుగుతుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మేధావి వర్గానికి చెందిన వారిని ఒప్పించి ఓటు వేయించుకునే బాధ్యత తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు చీకటి ఒప్పందాలతో ముందుకెళ్తుండగా, ఇందుకు బిఆర్ఎస్ తమ అభ్యర్థిని నిలపకపోవడం నిదర్శనమని, ఈ విషయంపై వారిని చైతన్యం చేయాలని అన్నారు. దేశాన్ని అప్పుల పాలు చేస్తూ కులం, మతం, ప్రాంతం, వర్గాల పేరిట విడదీస్తూ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్న బిజెపికి తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. చారిత్రాత్మక, సాహసోపేత నిర్ణయాలతో సీఎం రేవంత్ రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ చక్కటి ఫలితాలు సాధిస్తున్నట్లు చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన బీసీ, ఎస్సీల అభ్యున్నతికి కృషి చేస్తుండగా, రాష్ట్రంలో చేపట్టిన కుల గణన, ఎస్సీ వర్గీకరణ అమలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ తదితర అంశాలను బిజెపి, బిఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతున్నట్లు ఎద్దేవా చేశారు. అంతేకాకుండా ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్రానికి సీఎం రేవంత్ రెడ్డి రూ లక్షా 50 వేల కోట్ల పెట్టుబడులు సాధించగా, ఎన్నో సంస్థలతో ఎంఓయు కుదుర్చుకున్నట్లు తెలిపారు. మాజీ సీఎం కెసిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ కు ప్రత్యేకత ఉందని, ఆయనను ఎదుర్కోవడం ఆశామాషి కాదని పేర్కొంటూ నేరుగా పోరాటం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి పార్టీ అండగా ఉండడంతో పాటు వివిధ నామినేటెడ్ పోస్టుల భర్తీ, పెండింగ్ సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా గజ్వేల్ నియోజకవర్గంలోని గ్రాడ్యుయేట్లు, ఉద్యోగ, ఉపాధ్యాయులను నేరుగా కలిసి నరేందర్ రెడ్డికి ఓటు వేసే విధంగా పార్టీ శ్రేణులు దృష్టి పెట్టాలని, ఇందుకోసం ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పంట రుణమాఫీ, రైతు భరోసా, రూ 5 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం, రేషన్ కార్డులు పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ 500కే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ 10 లక్షల వరకు కార్పొరేట్ వైద్యం తదితర పథకాలపై ప్రజలను చైతన్యం చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు మడుపు భూంరెడ్డి, ఎలక్షన్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆంక్షా రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు గాడిపల్లి భాస్కర్, కృష్ణ, నాచగిరి మాజీ చైర్మన్లు లక్ష్మా రెడ్డి, మహేందర్ రెడ్డి, మాజీ ఆల్డ చైర్మన్ జనార్ధన్ రెడ్డి, మెదక్ ఆర్యవైశ్య సంఘం జిల్లా చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త, మాజీ ఎంపీపీ మోహన్, నరేందర్, భాస్కర్ రెడ్డి, ఆయా మండలాల బాధ్యులు, నేతలు శ్రీనివాస్ రెడ్డి, లింగా రావు, సందీప్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కిష్టా గౌడ్, రాములు గౌడ్, సారిక శ్రీనివాస్ రెడ్డి, సమీర్, రమేష్ గౌడ్, సుభాష్ చంద్రబోస్, రేగొండ, బూరెం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన శివాజీ

- కుల మతాలకు అతీతంగా చక్కటి పాలన అందించిన శివాజీ మహారాజ్
- ముస్లింలను ప్రధాన పోస్టుల్లో నియమించిన శివాజీ
- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 19 :

ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శివాజీ మహారాజ్ శత్రువుల గుండెల్లో నిద్రించినట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ లో జరిగిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంత్యోత్సవాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. మరాఠా యోధులు, కోట్లాదిమంది భారతీయుల ఆరాధ్య దైవంగా నిలిచిన ఆయన అన్ని వర్గాలను ప్రేమించినట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా మొగలుల రాజ్యంపై దండెత్తిన శివాజీ తన ముఖ్య అనుచరులుగా, ప్రధాన పదవుల్లో ముస్లింలనే నియమించుకోవడం ప్రత్యేకతగా నిలుస్తుందని తెలిపారు. ఛత్రపతి శివాజీ అన్ని వర్గాల ఆరాధ్య దైవంగా నిలుస్తూ హిందూ ధర్మాన్ని ప్రపంచవ్యాప్తం జేసినట్లు చెప్పారు. భారతీయులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో యువత నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మైనార్టీ సెల్ కాంగ్రెస్ జిల్లా నేత సమీర్, శ్రీ అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షులు డెక్కు శ్రీనివాస్ గుప్త, నాయకులు సుభాష్ చంద్రబోస్, శ్రీనివాస్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, రాములు గౌడ్, రమేష్ గౌడ్, రాజు గౌడ్, సాంబయ్య గుప్త, డప్పు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి మహిళా వృద్ధుల ఆశ్రమంలో భోజనాలు



జయభేరి, దేవరకొండ :

పోచంపల్లి బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కుంభం శేఖర్ శివలీల దంపతుల కుమార్తె చిరంజీవి చైత్ర పుట్టినరోజు సందర్భంగా దేవరకొండ మహాలక్ష్మి మహిళా వృద్ధుల ఆశ్రమంలో మాతలకు ఈ రోజు మధ్యాహ్నం పండ్లు పంపిణిచేసి భోజనాలు అందజేసినారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ మాకు ఈ అవకాశం కల్పించిన పెన్షనర్స్ సంఘం కార్యదర్శి అంకం చంద్రమౌళికి కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో వృద్ధాఆశ్రమం అధ్యక్షురాలు మాదిరెడ్డి సంధ్యారెడ్డి, అప్పం వీరయ్య, కర్నాటి సత్యనారాయణ, వృద్ధ మాతలు,కేర్ టేకర్ జానకి తదితరులు పాల్గొన్నారు.

## కొండమల్లేపల్లి లో ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



కొండమల్లేపల్లి :

చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను బుధవారం కొండమల్లేపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కొండమల్లేపల్లి ఎస్సై రామ్మూర్తి జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. కొండమల్లేపల్లి పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ చౌరస్తా గుండా పాత ఊరి ఆంజనేయస్వామి దేవాలయం వరకు చేపట్టారు.

చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పెద్ద ఎత్తున బాణ సంచాలు కాలుస్తూ, మహిళలు కోలాటం చేస్తూ ఘనంగా శివాజీ మహారాజ్ విగ్రహంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ శివాజీ గొప్పదేశ భక్తుడని, దేశ రక్షణకోసం ధర్మరక్షణకోసం చత్రపతి శివాజీ మహారాజ్ చూపించిన మార్గంలో యువత నడుచుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి శివాజీ యువదళ్ సభ్యులు భూషరాజు భరత్, నెల్లికంటి గోపి, కొమ్మినేని ఆంజనేయులు యాదవ్, ముడిగ శేఖర్ యాదవ్, కృష్ణ, సున్నం మహేష్, అంజన్, అభిలాష్, నాగరాజు నాయక్, భాస్కర్, శ్రీను, శేఖర్ రెడ్డి, హనుమంతు యాదవ్, లక్ష్మణ్, బావండ్ల సాయి, కిరణ్ గౌడ్, పెద్ద ఎత్తున యువకులు శివాజీ యువదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి

- మార్కుక్ మండల్ బిఆర్ఎస్ బిసి సెల్ అధ్యక్షుడు మ్యకల కనకయ్య ముదిరాజ్



జయభేరి, మార్కుక్, ఫిబ్రవరి 19 :

క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని మార్కుక్ మండల్ బి సి సెల్ అధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ అన్నారు మండలంలోని దామరకుంట గ్రామంలో గత పది రోజులు అండర్ 16 కబడ్డీ ఆటల ఏకలవ్య కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు రాజమైన కృష్ణ యాదవు కోచ్ నరేందర్ ఆధ్వర్యంలో నర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఏకలవ్య కబడ్డీ అసోసియేషన్ వారికి భోజన ఖర్చుకు క్రీడాకారుల ఖర్చులకు 10.000 రూపాయలు అందించి మానవత్వం చాటుకున్న మేకల కనకయ్య ముదిరాజ్ వారితో పాటు దామరకుంట మాజీ ఎం పీ టీ సీ కృష్ణ యాదవ్ పత్తి బాబు యాదవ్ మార్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ చంద్రం గౌడ్ మహేష్ లతిప్ బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారుని సత్కరించిన ఎఫ్డిసి

జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 19 :



సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ జాతీయస్థాయిలో హర్యానా రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి సీనియర్ మహిళ కబడ్డీ పోటీలలో పాల్గొని తన ఉత్తమమైన ప్రతిభను కబడ్డి పోటీలలో కనబర్చిన కబడ్డీ క్రీడాకారినీ రాణిని బుధవారం గజ్వేల్ లోని క్యాంపు కార్యాలయంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపిన సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలానే ఉత్తమమైన ప్రతిభను కనబరిచి తెలంగాణ రాష్ట్రానికి భారతదేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ నిరంతరం కృషి పట్టుదలతో ప్రాక్టీస్ చేసి మరిన్ని విజయాలు సొంత చేసుకుని దేశానికి రాష్ట్రానికి తీసుకోరావాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో టెన్నిస్ వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ షేక్ హైదర పటేల్, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ శివ, ఐదవ వార్డు కౌన్సిలర్ శ్యామల మల్లేశం, సిద్దిపేట జిల్లా కబడ్డీ జాయింట్ సెక్రెటరీ మహేష్ తదితరులున్నారు.

## చత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో అపశృతి

జయభేరి, వర్గల్, ఫిబ్రవరి 19 :

ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల్లో భాగంగా వర్గల్ మండలం జబ్బాపూర్లో అపశృతి చోటుచేసుకుంది. గ్రామంలో ఏర్పాటు చేసి కాషాయ రంగు జెండా ఎగరవేయటానికి లింగ ప్రశాంత్ (22) తో పాటు మరి కొంత మంది యువకులు ఏర్పాట్లు చేశారు. కాగా ఉదయం 11:35 గంటలకు జెండాను ఇనుము పైపుకు కట్టి లింగ ప్రశాంత్, వల్లపు బన్నీ, కొంతం వేణు కొంతం కనక రాజు, లింగ గణేష్, దెశెటి కరుణకర్, లింగ మహేష్ తదితరు లు జెండా పైపు పట్టుకుని పైకి లేపగా, ఇనుము పైపు ప్రమాదవశాత్తూ దగ్గరలోని విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో వారు విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే వీరిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, లింగ ప్రశాంత్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్ర గాయాలకు గురైన కరుణాకర్ను మెరుగైన చికిత్స కోసం స్థానిక నాగమునయ్య ఆస్పత్రికి తరలించారు. మిగతా వారి ఆరోగ్యము నిలకడగా ఉందని ఎస్ఐ కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు.



# రజనీతో కలిసి ప్రత్యేక గీతం

హిందీ చిత్రసీమలో వరుస పరాజయాలు పలకరించడంతో ఇప్పుడు తమిళ ఇండస్ట్రీపై దృష్టి పెడుతున్నది అగ్ర కథానాయిక పూజా హెగ్డే. దళపతి విజయ్ 'జన నాయగన్', సూర్య 'రెట్రో' చిత్రాల్లో ఈ భామ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కోలీవుడ్‌లో ఈ సొగసరి మరో భారీ ఆఫర్‌ను దక్కించుకుంది. రజనీకాంత్ 'కూలీ' చిత్రంలో పూజాహెగ్డే స్పెషల్‌సాంగ్‌లో నర్తిస్తున్నదని తెలిసింది. ప్రస్తుతం ఈ పాట షూటింగ్ జరుగుతున్నదని, ఇందులో పూజాహెగ్డే నృత్యాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయని మేకర్స్ అంటున్నారు. పూజాహెగ్డేకు ఐటెంసాంగ్స్ కొత్తేమి కాదు. గతంలో రంగస్థలం, ఎఫ్3 చిత్రాల్లో ఈ అమ్మడు ప్రత్యేక గీతాల్లో మెరిసింది. ఇటీవల విడుదలైన బాలీవుడ్ చిత్రం 'దేవ' బాక్సాఫీస్ వద్ద ఫెయిల్యూర్‌గా నిలవడంతో పూజాహెగ్డేకు నిరాశే ఎదురైంది. హిందీలో వరుస ఫ్లాపులను దృష్టిలో పెట్టుకొని ఇకపై దక్షిణాది సినిమాలకు ప్రాధాన్యతనివ్వాలనే ఆలోచనలో ఉందట పూజాహెగ్డే.



# మళ్లీ పూసలు అమ్ముకోవాల్సిందేనా..

## డైరెక్టర్ ప్రొడ్యూసర్‌కి గొడవ.. అయోమయంలో మోనాలిసా

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మోనాలిసా అనే అమ్మాయి వైరల్ అయిన విషయం తెలిసిందే. మధ్యప్రదేశ్ ఇండోర్ లోని ఓ చిన్న పల్లెటూరు నుంచి పూసలు అమ్ముకోవడానికి మహాకుంభమేళాకు వచ్చింది మోనాలిసా. అయితే తన వ్యాపారం బాగా జరుగుతుందనుకుంటే ఒక నెటిజన్ ఆమె ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. దీంతో రాత్రికి రాత్రే వైరల్‌గా మారింది మోనాలిసా. తన తేనె కళ్లు, అందం, చిరునవ్వుతో నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది.

దీంతో కుంభమేళాకి వెళ్లిన వారు ఆమెతో ఫొటో దిగడానికి ఆసక్తిచూపించడం.. ఫొటోల పేరుతో ఆమెను ఎక్కడపడితే అక్కడ తాకడం వివాదానికి దారి తీసింది. దీంతో తన పూసల బిజినెస్ వదిలేసి తన గ్రామంకి వెళ్లిపోయింది. అయితే మోనాలిసాకి జరిగిన అన్యాయం తెలుసుకున్న నెటిజన్లు ఆమెకి సపోర్ట్‌గా నిలిచారు. ఫేమస్ అనే పేరుతో అమె బ్రతుకుదెరువు మీద కొట్టారంటూ నెటిజన్లు కామెంట్లు పెట్టారు. ఇదిలావుంటే మోనాలిసా పరిస్థితి తెలుసుకున్న బాలీవుడ్ డైరెక్టర్ సనోజ్ మిశ్రా ఆమె చిత్రాలు చూసి హీరోయిన్‌గా అవకాశం ఇస్తానని తెలిపాడు. ఇప్పటికే మణిపూర్ నేపథ్యంలో రాబోతున్న ఒక మూవీకి సంతకం కూడా చేసింది మోనాలిసా. ఈ సినిమా కోసమే ప్రస్తుతం యాక్టింగ్ పై ట్రెయినింగ్ కూడా తీసుకుంటుంది మోనాలిసా.

మరోవైపు మోనాలిసాకి సంబంధించిన అన్ని పనులను దగ్గరుండి చూసుకుంటున్నాడు దర్శకుడు సనోజ్ మిశ్రా. అయితే సనోజ్ మిశ్రా ..మోనాలిసాతో క్లోజ్‌గా ఉండటంపై బాలీవుడ్ నిర్మాత జితేంద్ర నారాయణ్ సింగ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. సనోజ్ మిశ్రాపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సనోజ్ మోనాలిసాను పబ్లిసిటీ కోసం వాడుకుంటున్నారని, ఆమెను ట్రాప్ చేస్తున్నారని, తప్పుదారి పట్టిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదిలావుంటే తాజాగా ఈ వ్యాఖ్యలపై సనోజ్ మిశ్రా స్పందించారు. మోనాలిసా నా కూతురు లాంటిదని తెలిపాడు. ఆమె నా కూతురు వయసు ఉంటుంది.

నేను ఆమెను వేధించట్లేదు. ఆమె ఇష్టపూర్వకంగా నే సినిమాలో నటిస్తుంది. మోనాలిసా ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఆమెను నేనే యాక్టింగ్ నేర్పిస్తున్నాను. ఇది తప్పుదోవ పట్టించడం కాదు. తనకి యాక్టింగ్ వచ్చింది అన్నప్పుడు సినిమా స్టార్ట్ చేస్తానని తెలిపాడు.

మరోవైపు జితేంద్ర నారాయణ్‌పై కూడా విమర్శలు కూడా గుప్పించాడు. తన అబద్ధాలతో మొత్తం దేశాన్నే ట్రాప్ లోకి లాగుతున్నాడని మండిపడ్డారు. ఇక వీరిద్దరి గొడవతో ప్రాజెక్ట్ ఆగిపోతుందేమోనని భయపడుతుంది మోనాలిసా.



# పరేషాన్ చేస్తున్న పావని

## ఐకాన్ స్టార్ అన్న కూతురుని చూశారా..

పావని కరణం 2023లో రిలీజైన పరేషాన్ సినిమాతో హీరోయిన్‌గా వెండితెరపై అడుగు పెట్టి మొదటి సినిమాతోనే తన నటనతో అందరినీ ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. అయితే ఆ సినిమాలో ఈ బ్యూటీ తన నటతో ఆకట్టుకున్నప్పటికీ హీరోయిన్‌గా అంతగా అవకాశాలు రాలేదు. దీంతో పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసుకుంటూ వచ్చి, చివరకు పాన్ ఇండియా సినిమాలోనే ఆఫర్ కొట్టేసింది. పావని సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా వచ్చిన పుష్ప మూవీ రికార్డ్స్ క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. కాగా ఈ ముద్దుగుమ్మ ఈ సినిమాలో నటించి ఓవర్ నైట్ స్టార్ గా మారిపోయింది. పుష్పలో చిన్న పాత్రలో కొద్దిసేపే కనిపించిన ఈ బ్యూటీ, పుష్ప2లో మాత్రం కీలక పాత్రలో నటించి, అందరినీ మెప్పించింది. దీంతో ఈ అమ్మడుకు ఫ్యాన్ ఫాలోయింగ్ విపరీతంగా పెరిగిపోయింది. చిన్నానా అంటూ.. అల్లు అర్జున్‌ను పిలుస్తూ..తన నటనతో ఆకట్టుకుంది. ఇక తాజాగా ఈ బ్యూటీ తన లేటెస్ట్ ఫోటో షూట్‌తో వావ్ అనిపించింది. పర్పుల్ కలర్ డిజైనరీ డ్రెస్‌ల అందాల విందు ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

# గడిచిన కాలం తిరిగి రమ్మన్నా రాదు..



'సోషల్ మీడియాతో జాగ్రత్త. అందులో చూసే ప్రతిదాన్నీ నమ్మొద్దు. ఒకవేళ నమ్మితే.. మీ మనసుల్లోకి అనవసరమైన చెత్త వచ్చి చేరుతుంది. అందుకే తెలివిగా ముందడుగేయండి. సమయం చాలా విలువైంది. వెళ్లిపోయిన కాలం తిరిగి రమ్మన్నా రాదు. గడిచిన తర్వాత కాలం విలువను గుర్తించడం అవివేకం. అందుకే సమయాన్ని సద్వినియోగం చేసుకోండి.' అంటూ హితవు పలికారు తమిళ అగ్రనటుడు విజయ్ సేతుపతి. ఇటీవల ఓ కాలేజీ ఈవెంట్‌లో విద్యార్థులతో మాట్లాడారాయన. ఈ సందర్భంగా అజిత్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నట్టు వస్తున్న వార్తలపై ఆయన స్పందిస్తూ.. 'గతంలో అజిత్‌తో కలిసి నటించే అవకాశం వచ్చింది. కానీ కొన్ని కారణాల వల్ల కార్యరూపం దాల్చలేదు. అజిత్ గొప్ప నటుడు, మంచి వ్యక్తి. ఆయనతో కలిసి నటించే అవకాశం వస్తే వదులుకోను. ఇప్పటికైతే అలాంటి ఆఫర్ నాకు రాలేదు. నా కెరీర్‌లో ఏదీ ప్లాన్ చేసుకోలేదు. అన్నీ అనుకోకుండానే వచ్చాయి. వచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ ముందుకెళ్తున్నా' అంటూ చెప్పుకొచ్చారు విజయ్ సేతుపతి.





# స్వగ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో నాగ్ అశ్విన్..

స్వగ్రామంలో కల్కి చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ సందడి చేశారు. నాగర్ కర్నూలు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డితో కలిసి తాడూరు మండలంలోని ఐతోలు గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగ్ అశ్విన్‌పై ప్రశంసలు గుప్పించారు. స్వగ్రామంలో పిల్లల కోసం పాఠశాల భవనం కట్టడానికి ఆర్థిక సాయం చేశారని చెప్పారు. జాతీయ స్థాయిలో సినీ రంగంలో పేరు ప్రఖ్యాతలు తెచ్చున్న నాగ్ అశ్విన్.. ఇంటర్నేషనల్ లెవల్‌లో రాణించాలని, పరిశ్రమలో మరెన్నో విజయాలు అందుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. నాగ్ అశ్విన్ సొంతూరు నాగర్ కర్నూలు జిల్లా తాడూరు మండంలోని ఐతోలు గ్రామం. ఆయన పూర్వికులు ఎప్పుడో హైదరాబాద్ వెళ్లి.. అక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. కానీ నాగ్ అశ్విన్ స్వగ్రామానికి తోడ్పాటు అందిస్తూ ఉంటారు. గ్రామంలో పిల్లల కోసం మ్యూజిక్, ఇతర పరికరాలను నాగ్ అశ్విన్ అందుబాటులోకి తీసుకొచ్చారు. అతడితో గ్రామ ప్రజలు కూడా ఎంతో ప్రేమతో వ్యవహరిస్తారు. లీడర్, లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ వంటి చిత్రాలకు సహాయ దర్శకుడిగా నాగ్ అశ్విన్ పనిచేశారు. ఎవడే సుబ్రహ్మణ్యంతో దర్శకుడి మారి.. విజన్ ఉన్న క్రియేటివ్ పర్సన్‌గా పేరొందారు. ఆ తర్వాత మహానాటి సావిత్రి బయోపిక్‌ను మనసుకు తాకే విధంగా తీసి.. విమర్శకులు ప్రశసంలు అందుకున్నారు. ఆపై ప్రభాస్‌తో కల్కి 2898 ఏ.డీ తెరకెక్కించి.. సంచలనం సృష్టించారు. బ్లాక్ బాస్టర్‌గా నిలిచిన ఈ చిత్ర రెండో పార్ట్ పనులు చకచకా జరుగుతున్నాయి.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com